క్లుప్తంగా

నేడు పోలమాంబ మారువారం పండగ


పోలమాంబ అమ్మవారు

ఏయూ క్యాంపస్: శ్రీపోలమాంబ అమ్మవారి మారువారం పండగ మంగళవారం జరగనుంది. సాధారణ జాతరతో సమానంగా మారువారం పండగను నిర్వహించడం సంప్రదాయం. ఈ సందర్భంగా మంగళవారం కూడా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఇందుకు అనుగుణంగా ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. అదే విధంగా ఈ నెల 15న ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

పోటీ పరీక్షలకు సమ్మర్ కామన్ కోచింగ్

డాబాగార్డెన్స్: అన్ని పోటీ పరీక్షలకు అవసరమయ్యేలా సమ్మర్ కామన్ కోచింగ్ ప్రారంభించనున్నట్టు అల్లూరి స్టడీ సర్కిల్ నిర్వాహకుడు కె.అభిమన్యు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాలయాల ప్రవేశాలకు ఉపయోగపడేలా ఈ కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 2 నెలల పాటు నిర్వహించే ఈ తరగతులు వేసవి సెలవుల్లో యువత సమయాన్ని వృథా చేయకుండా, అభివృద్ధికి దోహదం చేసేలా ఉంటాయన్నారు. విద్యాలయాల ప్రవేశ పరీక్షల్లోను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు కామన్‌గా ఉండే ఇంగ్లిష్ లాంగ్వేజ్, అర్థమెటిక్, రీజనింగ్, జీకే, కరెంట్ అఫైర్స్ సబ్జెక్టులు బోధిస్తారని తెలిపారు. మరింత సమాచారం కోసం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి స్టడీ సర్కిల్లో స్వయంగా, లేదా 80084 12798 ఫోన్‌లో సంప్రదించవచ్చు.

20 కిలోల గంజాయి స్వాధీనం


పట్టుబడిన గంజాయి

బీచ్ రోడ్డు: అక్రమంగా తరలిస్తున్న 20 కేజీల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. మహారాణిపేట పరిధిలో సింహాద్రి ఆస్పత్రి పక్కన గంజాయి ఉందని వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేశారు. నలుగురు వద్ద ఉన్న 20 కేజీల గంజాయి, ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు, ఎనిమిది మొబైళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు అల్లూరి జిల్లాకు చెందిన కిల్లో ప్రసాద్ రావు, కిల్లో సురేష్ కుమార్, ఒడిశాకు చెందిన సిద్దేష్ కొర, బిహార్‌కు చెందిన అన్వర్‌లను మహారాణిపేట పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.

నేడు కనకమహాలక్ష్మికి స్వర్ణ పుష్పార్చన

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ వర్గాలు తెలిపాయి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. ఈ మెయిల్ ఐడీ endow-eokanaka@gov.in ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు.

గిరిప్రదక్షిణ రోడ్డు అభివృద్ధికి వినతి

మర్రిపాలెం: టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని సోమవారం 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. తాటిచెట్లపాలెం అభయాంజనేయస్వామి ఆలయానికి వచ్చిన ఆయనను కలిసి వార్డులోని మాధవధారలో ఉన్న గిరిప్రదక్షిణ రోడ్డు కోసం వివరించి అభివృద్ధి చేయాలని వినతిపత్రం అందించారు.

హెల్త్‌సిటీలో రోడ్డుపై యథేచ్ఛగా పార్కింగ్

- మార్కింగ్ వేసి మరీ కేటాయిస్తున్న ఆస్పత్రుల యాజమాన్యాలు
- రోడ్డు మధ్యలో నుంచి పాదచారుల రాకపోకలు


రోడ్డు మధ్యలో నడుస్తున్న పాదచారులు


హెల్త్‌సిటీలో రోడ్డుపై ఇరువైపులా పార్కింగ్ చేసిన వాహనాలు

ఆరిలోవ: స్థానిక హెల్త్‌సిటీలోని రోడ్లు పార్కింగ్ స్థలాలుగా మారిపోయాయి. ఇక్కడ ఉన్న విశాలమైన రోడ్లు పార్కింగ్‌తో ఇరుకుగా తయారయ్యాయి. రోడ్లకు ఇరువైపులా వాహనాలు నిలపడంతో పాదచారులు మధ్యలోంచి నడవాల్సిన పరిస్థితి నెలకొంది. హెల్త్‌సిటీలో సుమారు 28 ఆస్పత్రుల కోసం స్థలాలు కేటాయించారు. ఆస్పత్రి నిర్వాహకులు పెద్ద ఆస్పత్రులు నిర్మిస్తామని విశాలమైన స్థలాలు ప్రభుత్వం నుంచి పొందారు. ఆ స్థలాల్లో సెల్లార్లు, అంతస్తులు పేరుతో పెద్ద భవనాలు నిర్మించేశారు. సెల్లార్లు కిందన పార్కింగ్ కోసం టౌన్‌ప్లానింగ్ అధికారుల నుంచి అనుమతులు పొందారు. అంతవరకు బాగానే ఉంది. కానీ పార్కింగ్ వ్యవహారంలో మాత్రం కొన్ని ఆస్పత్రులు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఆస్పత్రుల లోపల పార్కింగ్‌లో వైద్యులు, సిబ్బందికి సంబంధించిన కార్లు, ఇతర వాహనాలను మాత్రమే నిలపడానికి అనుమతి ఇస్తున్నారు. రోగులను తీసుకెళ్లే వాహనాలకు సెల్లార్లు లోపలకు అనుమతి ఇవ్వడంలేదు. వారి కార్లు, ద్విచక్ర వాహనాలను ఆయా ఆస్పత్రుల ముందు రోడ్లపైనే పార్కింగ్ చేయాలని సూచిస్తున్నారు. దీంతో రోగులను తీసుకెళ్లే కార్లు, ఇతర వాహనాలను రోడ్లపై ఇరువైపులా పార్కింగ్ చేస్తున్నారు.

పాదచారులకు తప్పని పాట్లు

ఇక్కడి రహదారులపై పాదచారుల కోసం ఇరువైపులా ప్రత్యేకంగా తెల్ల గీతలు గీయించారు. రోడ్డు అంచుల నుంచి ఆ తెల్ల గీత మధ్యలో పాదచారులు నడవాల్సి ఉంది. కానీ ఆ లైన్లలోనే వాహనాల పార్కింగ్‌కు మార్కింగ్ చేయడంతో పాదచారులకు అవస్థలు తప్పడం లేదు. కొన్ని చోట్ల ఆస్పత్రుల ముందు ప్రైవేట్ అంబులెన్సులు కూడా పార్క్ చేయాల్సి వస్తోంది. దీంతో విశాలమైన రోడ్లు ఇరుకుగా మారాయి

మరింత ముందడుగు వేసిన ఓ ఆస్పత్రి

హెల్త్‌సిటీలో పినాకిల్ ఆస్పత్రి ఎదురుగా వైజాగ్ శ్రీనివాస హెల్త్ కేర్ సెంటర్ నిర్వాహకులు మరింత ముందడుగు వేశారు. ఈ ఆస్పత్రి ముందు రోడ్డునే పూర్తిగా పార్కింగ్‌గా వినియోగించుకుంటున్నారు. కార్ల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా గీతలు గీసి, మార్కింగ్ వేయించారు. రోగులను తీసుకెళ్లిన కార్లకు లోపలకు ప్రవేశం లేకుండా ముందు సెక్యూరిటీతోనే పార్కింగ్ చేయిస్తున్నారు. దీంతో పాటు ఒమేగా, తదితర ఆస్పత్రులదీ అదే పరిస్థితి. ఇప్పటికైనా పోలీసులు స్పందించి వాహనాల పార్కింగ్ ఆస్పత్రుల సెల్లార్లలో చేసేలా చర్యలు చేపట్టాలని రోగుల బంధువులు కోరుతున్నారు.


రోడ్డుపైనే కారు పార్కింగ్ కోసం మార్కింగ్ చేసిన ఆస్పత్రి నిర్వాహకులు

రోడ్డుపై పార్కింగ్ చేస్తే చర్యలు

ఆస్పత్రుల నిర్వాహకులు వాహనాల కోసం పార్కింగ్ సౌకర్యం కల్పించాలి. బయట రోడ్డుపై పార్కింగ్ చేయిస్తే చర్యలు తీసుకుంటాం. రోడ్డుపై పార్కింగ్ వల్ల అంబులెన్సులు, పాదచారులకు ఇబ్బంది కలుగుతోంది. హెల్త్‌సిటీలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
-కుమార్, ఎస్ఐ, ఆరిలోవ ట్రాఫిక్

నగరాభివృద్ధికి రాజాబాబు కృషి అభినందనీయం


సమావేశంలో మాట్లాడుతున్న పితాని ప్రసాద్

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ మాజీ కమిషనర్ రాజాబాబు నగరాభివృద్ధికి చేసిన కృషి అభినందనీయమని ఏపీ బీసీ స్టడీ సర్కిల్స్ ఎంప్లాయీస్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు అన్నారు. రాజాబాబు పనితీరుపై కొందరు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో సోమవారం రాష్ట్ర బీసీ సంఘం, ఏయూ పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో సోమవారం ఎంవీపీ కాలనీ సెక్టార్-6లో ఓ హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా తక్కువ సమయం జీవీఎంసీ కమిషనర్‌గా ఉన్న రాజాబాబు అనేక ప్రతిష్టాత్మక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్, జీ20 సదస్సులను విజయవంతంగా నిర్వహించడంలో సఫలీకృతమయ్యారన్నారు. జిల్లా కలెక్టర్‌తో కలిసి అభివృద్ధి ప్రణాళికలను విజయవంతంగా అమలు చేశారన్నారు. తద్వారా నగరానికి అంతర్జాతీయంగా మంచి గుర్తింపు తెచ్చారని చెప్పారు. బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్ మాట్లాడుతూ రాజాబాబుపై కొందరు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. చాలా తక్కువ సమయంలో రూ.400 కోట్లు వరకు యంత్రాంగం ద్వారా పన్నులు వసూళ్లు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ఎస్.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు కాగితాల రామారావు, కండిపిల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

మద్యం తాగిన వాహన చోదకులపై కేసులు, జరిమానా


వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు

మర్రిపాలెం: గత పది రోజులుగా కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు కంచరపాలెం, ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి 11 గంటల నుంచి సోమవారం తెల్లవారు వరకు జ్ఞానాపురం బ్రిడ్జి నుంచి కంచరపాలెం మెట్టు వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. లారీలు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలపై కొరడా ఝుళిపించారు. ఈ పది రోజుల్లో 48 మందిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశామని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. అందులో 27 మందిని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రూ.33 వేలు జరిమానా విధించినట్టు చెప్పారు. రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు ముందస్తు చర్యగా స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. గతంలో జరిమానాలు విధించి కట్టని వాహన చోదకుల నుంచి వసూలు చేశామన్నారు. ఎస్ఐలు వాసుదేవరావు, పాపారావు, ఉల్‌హక్ ప్రత్యేక బృందాలుగా తనిఖీ చేపట్టారని సీఐ తెలిపారు.

'కార్మికులను మభ్యపెడుతున్న గుర్తింపు సంఘం'


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మిక వర్గాన్ని గుర్తింపు సంఘం, యాజమాన్యాలు మభ్యపెడుతున్నాయని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్ ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ స్టోర్స్ యూనియన్ పాయింట్ వద్ద సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు మ్యానిఫెస్టోలో హామీలు ఇచ్చిన ఏఐటీయూసీ గెలిచిన తర్వాత ఇదిగో, అదిగో అంటు కాలయాపన చేస్తోందన్నారు. యాజమాన్యంపై ఒత్తిడి తేవడంలో గుర్తింపు యూనియన్ పూర్తిగా విఫలమైందన్నారు. ఉత్పత్తికి తగ్గ ఇన్సెంటివ్ ఇప్పించలేకపోతున్నారన్నారు. వేతన సవరణ, సిబ్బంది భర్తీ, ఇన్సెంటివ్ తదితర అంశాలపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన తప్పదన్నారు. కార్యక్రమంలో నీరుకొండ రామచంద్రరావు, బీఎంకె నాయక్, గొందేశి ప్రభాకరరెడ్డి, సుదర్శనం, గోపాలరాజు, ఎస్.ఎ. నాయుడు పాల్గొన్నారు.

కోఆపరేటివ్ సొసైటీలో అవినీతిపై కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎన్ఏడీ సీఈ యూనియన్ సభ్యులు

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపో సివిల్ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ సొసైటీ పాలకవర్గం అవినీతికి పాల్పడుతోందని సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు మల్లికార్జునకు ఎన్ఏడీ సీఈ యూనియన్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్ యార్డు ఐఎన్‌సీఈ కోఆపరేటివ్ పాలకవర్గం చేసిన ఖర్చు కంటే సుమారు రూ. 63 లక్షలు ఎక్కువ ఖర్చు చేసిందని ఆరోపించారు. ఎన్ఏడీ సొసైటీలో 925 మంది మాత్రమే ఉన్నారని.. డాక్ యార్డు సొసైటీలో 7225 మంది సభ్యులున్నారని తెలిపారు. అవినీతి కారకుడైన సొసైటీ కార్యదర్శితో పాటు పాలక మండలిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేవారు.

హైవేలో రెండు రోడ్డు ప్రమాదాలు


స్కూటీ ఢీకొట్టడంతో దెబ్బతిన్న కారు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి లోని జాతీయ రహదారిపై సోమవారం రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. శాంతిపురం రహదారిపై ఓ కారును అతివేగంగా వచ్చి స్కూటీ ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు సైడ్ భాగం దెబ్బతింది. స్కూటీతో ఢీకొట్టిన యువకుడి కాలుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మరో ఘటనలో కారును లారీ ఢీకొట్టడంతో కారు వెనుక భాగం నుజ్జునుజ్జయింది. రెండు వర్గాల వారు ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో ఫిర్యాదులు చేశారు.

ఆర్టీసీ బస్సులో మేయర్ ప్రయాణం


బస్సు దిగి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోకి వెళ్తున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ గొలగాని హరివెంకటకుమారి సోమవారం ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. తన క్యాంపు కార్యాలయం నుంచి నడుచుకుంటూ ఆర్టీసీ బస్టాప్‌కు చేరారు. సిటీ బస్సులో సాధారణ ప్రయాణికుల వలే డబ్బులిచ్చి టికెట్ తీసుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ప్రయాణించి జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. చాలా మంది అధికారులు సొంత వాహనాల్లో కార్యాలయానికి వస్తున్నట్టుగా తెలిసిందని, సొంత, ప్రభుత్వ వాహనాలు విడనాడి ఆర్టీసీ బస్సుల్లో రావాలని ఆదేశించారు.

బీజేపీ ఆధ్వర్యంలో వాల్ రైటింగ్స్


వాల్ రైటింగ్ చేస్తున్న రవీంద్ర

ఎంవీపీ కాలనీ: బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం వాల్ రైటింగ్స్(గోడ రాతలు) కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పిలుపు మేరకు మరొక్కసారి మోదీ సర్కార్ పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర సోమవారం ఎంవీపీ కాలనీ సెక్టార్-10లో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొని గోడ రాతలు రాశారు. విశాఖలో ఉన్న ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో 2 నుంచి 3 చోట్ల ఈ వాల్ రైటింగ్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మోదీ సర్కార్ మరోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చే దిశగా ప్రజల్లో చైతన్యం కలిగించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జ్ఞానవిస్తృతికి ఐఎస్‌టీడీ కృషి

మురళీనగర్: జ్ఞానవిస్తృతిని పెంచడమే ప్రధాన లక్ష్యంగా ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ పనిచేస్తోందని ఐఎస్‌టీడీ వైజాగ్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఓఎం రావ్ తెలిపారు. ఐఎస్‌టీడీ 53వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 52 చాప్టర్లు ఉన్నాయని, వైజాగ్ చాప్టర్‌లో వివిధ సాంకేతిక విభాగాల్లో ఉన్నత పదవుల్లో పనిచేసిన 600 మంది ప్రముఖులు సభ్యులుగా ఉన్నట్లు చెప్పారు. కాలేజీల్లో ఏర్పాటు చేసిన స్టూడెంట్ చాప్టర్ల ద్వారా వీరు విద్యార్థులకు వారి సబ్జెక్టుతో పాటు నైపుణ్యాల సాధనకు అవసరమైన పరిజ్ఞానాన్ని అందిస్తారని వివరించారు. ఈ చాప్టర్ల ద్వారా నిపుణుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు డాక్టర్ రావ్ సూచించారు. వారు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కెమికల్ విభాగం హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఇతర విభాగాల హెడ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాలుగో రోజు అదే జోరు

- ఉత్సాహంగా 'మా నమ్మకం నువ్వే జగన్'
- ప్రజల నుంచి విశేష ఆదరణ


మహిళకు కరపత్రం అందిస్తున్న 12వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు


23వ వార్డులో స్టిక్కర్ అతికిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని, కార్పొరేటర్ విజయసాయి

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నాలుగో రోజు సోమవారం కూడా జోరుగా సాగింది. ఆరిలోవ ప్రాంతం జీవీఎంసీ 9, 10, 11, 12, 13 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు గడపగడపకు ఉత్సాహంగా వెళ్లి స్థానికులకు కరపత్రాలు అందించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. వారితో మాట్లాడి ప్రభుత్వ పాలన గురించి తెలుసుకున్నారు. వారి ఇంటి గోడలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో ఉన్న స్టిక్కర్లు అతికించారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 12వ వార్డులో పార్టీ నాయకులు దుర్గానగర్‌లో గడపగడపకు వెళ్లి పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి చొక్కెర శేఖర్, మార్కెటింగ్ శాఖ మాజీ చైర్మన్ అల్లంపల్లి రాజబాబు, నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, పి.ఐ.బాలరాజు, అర్జున్, రాజులమ్మ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు పరిధి ఈస్ట్ పాయింట్ కాలనీ, లాసన్స్‌బే కాలనీ ప్రాంతాలలో కార్పొరేటర్ ముప్పల లక్ష్మి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు చేరువవుతున్న విధానం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ముప్పల సురేష్, కన్వీనర్‌లు కాగితాల లక్ష్మణ రెడ్డి, దుగ్గిరాల నాగరాజు, మండే పద్మ, తదితరులు పాల్గొన్నారు.

మా భవిష్యత్తు.. మా నమ్మకం జగనన్నే

మద్దిలపాలెం: మా భవిష్యత్తు, మా నమ్మకం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ప్రజలు ముక్తకంఠంతో నినదిస్తున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. ఇది చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు అవాకులు, చవాకులు పేలుతున్నారని ధ్వజమెత్తారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం సోమవారం 23వ వార్డులో జరిగింది. ఈ సందర్భంగా అక్కరమాని స్థానిక కార్పొరేటర్ గుడ్ల విజయసాయితో కలిసి ఇంటింటికీ వెళ్లారు. నేరుగా ప్రజలతో మాట్లాడారు. పథకాల గురించి వివరించారు. వారి ఆమోదం మేరకు స్టిక్కర్ అతికించారు. అనంతరం అక్కరమాని మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి లభిస్తున్న విశేష స్పందనను చూసి తమకు భవిష్యత్తు లేదనే చింతతో టీడీపీ మహిళా నాయకులు మతిస్థిమితం లేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. దమ్ముంటే రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమంపై అనితా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అక్కరమాని వెంకటరావు, గుడ్ల సత్యారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 22వ వార్డులో అక్కరమాని విజయనిర్మల పర్యటించారు. ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, తదతరులు పాల్గొన్నారు.


20వ వార్డులో పథకాల గురించి వివరిస్తున్న కార్పొరేటర్ ముప్పల లక్ష్మి


22వ వార్డులో పథకాల గురించి వివరిస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఏయూ సమాచారమ్

సమర్థవంతంగా మురుగునీటి నిర్వహణ


ప్రసంగిస్తున్న ఐఐపీఈ సంచాలకులు ఆచార్య శాలివాహన్

ఏయూ క్యాంపస్: మురుగునీటిని సమర్థవంతంగా నిర్వహించడం, పునర్వినియోగంగా మార్చడం ఎంతో అవసరమని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ సంచాలకుడు ఆచార్య శాలివాహన్ అన్నారు. ఐఐపీఈ సమావేశ మందిరంలో 'వేస్ట్ వాటర్ క్యారక్టరైజేషన్, ట్రీట్‌మెంట్-రీయూజ్' అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం శాలివాహన్ మాట్లాడుతూ మురుగునీటి నిర్వహణ విధానాలు, ప్రాధాన్యతను వివరించారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ టి.రాజేంద్ర కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మురుగునీటి లక్షణాలను శాస్త్రీయంగా తెలుసుకోవడం, శుద్ధి చేసే విధానాలు, పునర్వినియోగం చేయడం ప్రస్తుతం ఎంతో అవసరమన్నారు. నీటి వనరుల లభ్యత తగ్గుతూ, వినియోగం పెరుగుతున్న తరుణంలో మురుగునీటిని సైతం శుద్ధిచేసి ప్రత్యేక అవసరాలకు వినియోగించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. సదస్సులో పాల్గొన్న వారికి ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించే విధంగా ఐఐపీఈ ప్రయోగశాలను సందర్శించారు. మురుగనీటి పునర్వినియోగంలో ఎదురయ్యే సవాళ్లపై చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఎన్ఎల్ ప్రతినిధి జి.ఫణికుమార్, సదస్సు కన్వీనర్ డాక్టర్ రవికుమార్ సోన్నాని, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏవోఐ మహాసభ లోగో ఆవిష్కరణ


లోగో ఆవిష్కరిస్తున్న ఎల్ఐసీ ఏవోఐ ఆహ్వాన కమిటీ

డాబాగార్డెన్స్: ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ ఏవోఐ) అఖిల భారత జాతీయ 6వ మహాసభలు ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్నారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న మహాసభల లోగోను జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటూ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభల చైర్మన్ సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ ఎల్ఐసీని కాపాడుకోవడం.. ఏజెంట్లను రక్షించుకోవాలన్న నినాదంతో 2003లో సంఘం ఆవిర్భవించిందని తెలిపారు. అప్పటి నుంచి లక్ష్యం కోసం పోరాడుతున్న ఏకైక జాతీయ స్థాయి ట్రేడ్ యూనియన్ అని పేర్కొన్నారు. మహాసభకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి 600 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. మహాసభల్లో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా భవిష్యత్ పోరాటాలు రూపొందించడం జరుగుతుందని చెప్పారు. వంద మందితో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎల్.మంజునాథ్, జోనల్ సెక్రటరీ పి.ఎల్. నరసింహారావు, విశాఖ డివిజన్ సెక్రటరీ ఎస్.ఆర్. ఠాగూర్, సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాలెం రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం: మర్రిపాలెం రైల్వే స్టేషన్ సమీపంలోని ఓర్ ఎక్స్ఛేంజ్ కాంప్లెక్స్ దగ్గర సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు. వివరాలిలా.. సుమారు 30-35 ఏళ్ల వ్యక్తి మర్రిపాలెం స్టేషన్ సమీపంలో సోమవారం కరెంటు షాక్ వల్ల చనిపోయాడు. ఈ వ్యక్తి ఏదైనా గూడ్స్ రైలుపై నుంచి విద్యుత్ వైర్లను పట్టుకోవడం వల్ల, కరెంట్ షాక్ తగలడం వల్ల లేదా మరే ఇతర కారణాల వల్ల అయిన మరణించి ఉండవచ్చు. ఈ వ్యక్తి బూడిద రంగు ప్యాంట్ మీద తెలుపు రంగు డాట్స్‌తో కూడిన ప్యాంట్, నీలం రంగు నిక్కరు ధరించి ఉన్నాడు. విద్యుత్ షాక్ వల్ల శరీరం నల్ల బడి పోయింది. ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ స్టేషన్ వద్ద స్వయంగా గానీ లేదా 94406 27547, 98664 13487 నంబర్ల లో తెలియజేయాలని కోరారు.